## సూర్యాపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- ఇద్దరికి జైలు శిక్ష, ఒకరికి కమ్యూనిటీ సర్వీస్
- పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11 మందిని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపు రజిత తీర్పు వెలువరించారు. తీర్పు ప్రకారం ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు.2,000 జరిమానా విధించగా, మరో ఒక్కరికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించారు.మిగిలిన ఎనిమిది మందికి మొత్తం .7,900 జరిమానా విధించారు.

ఈ వివరాలను సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల భద్రత కోసం పోలీసులు నిర్వహించే వాహన తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆదివారం రాత్రి కురిసిన వర్షా నికి కూలిపోయిన ఇల్లు

**బాధిత కుటుంబాన్ని సందర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు గెరిగింట్ పల్లి గ్రామంలో ఇల్లు కూలిపోవడంతో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అర్ధ సుధాకర్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించేందుకు, ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రెడ్యా నాయక్. బుచ్చయ్య, నరసింహులు, రెడ్డి శేఖర్ వడ్డేశీను, కురువ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేపల కోసం వెళ్లి వ్యక్తి మృతి

**వివరాలు తెలిపిన వికారాబాద్ సిఐ రఘు కుమార్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** చేపల కోసం వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ మండల పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ సిఐ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలోని అట్నాపూర్ గ్రామానికి చెందిన పరమేశ్వర్(45) ఆదివారం ఉదయం తన స్నేహితులతో కలిసి చేపల కోసం వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధన్నారం గ్రామ సమీపంలోని రైస్ మిల్లు పక్కన క్రషర్ దగ్గర మృతి దేహం లభించడం జరిగింది అన్నారు. మద్యం మత్తులో క్రషర్ లో పడి చనిపోయినట్లు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా చేపలు పట్టడానికి వెళ్ళితే ఒంటరిగా వెళ్లకుండా తాము ఇతరులను కూడా తీసుకొని వెళితే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని సూచించారు.

## భారతీయ జనతా పార్టీ బెజ్జంకి మండల సమావేశం

**ఎస్ఐఆర్ లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి**

**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** బెజ్జంకి మండలకేంద్రంలోని బీజేపి పార్టీ కార్యాలయంలో మండల పదాధికారులు, శక్తి కేంద్రాల ప్రముఖుల సమావేశానికి మండల ఇంచార్జ్ ముత్యాల జగన్ రెడ్డి హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం,ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమాల అమలు, కార్యకర్తల బాధ్యతలపై సమగ్రంగా మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం,ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.అనంతరం బీజేపీ బెజ్జంకి మండల అధ్యక్షులు కొలిపాక రాజు మాట్లాడుతూ మండల నాయకత్వం అంతా కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు.సమావేశం అనంతరం మండల నాయకులు సంగ రవి ఇంట్లో ఆత్మీయంగా ఏర్పాటు చేసిన భోజనంలో పాల్గొన్నారు.కార్యకర్తల ఆత్మీయత, అంకితభావానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ బుర్ర మల్లేశం గౌడ్,గుగ్గిళ్ల సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, మండల ఉపాధ్యక్షులు గైని రాజు, మహిళామోర్చా నాయకురాలు బండిపెల్లి సునీత,యువ మోర్చా మండల అధ్యక్షులు తూముల రమేష్ ,మండల నాయకులు వడ్లూరి సాయిలు, శ్రీనివాస్, నూనె అంజయ్య,బుర్ర కిషన్,బెజ్జంకి రాజమల్లు, కంది రాజు తదితరులు పాల్గొన్నారు

## కొడంగల్ ప్రభుత్వ గర్ల్ హాస్టల్ లో చాలీచాలని వసతులు

- ఒకే ఎస్సీ హాస్టల్ భవనంలో స్కూల్, కాలేజ్ పారామెడికల్ కళాశాల హాస్టల్ విద్యార్థులు
- చాలీచాలని వసతులతో అనేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థినీలు
- బాలికల హాస్టల్ చుట్టూ కాంపౌండ్ వాల్ లేక పోకిరిలా బెడద
- తట్టుకోలేకపోతున్నా విద్యార్థినిలు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సోమవారం కోడంగల్ టౌన్ లో ( ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ , రైతు సంఘంలు) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ సర్వే చేయడం జరిగింది. అనేక రకాల సమస్యల మధ్యన విద్యార్థునిలు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సొంత భవనాలు నిర్మించాలని ప్రజాసంఘాలు ఆరోపించారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఇస్తున్న పాకెట్ మనీ, బీసీ హాస్టల్ విద్యార్థి నులకు కూడా ఇవ్వాలన్నారు. విద్యార్థినులకు రావలసిన నోట్ పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు, పెట్టెలు స్కూల్ యూనిఫాంలు వెంటనే ఇవ్వాలని తెలిపారు. హాస్టల్ లో విద్యార్థులు కనీస వసతులు లేకుండా ఇబ్బందులనుండి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కాడా స్పెషల్ అధికారి పర్యవేక్షణ చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నాము లేనిచో ఆందోళనలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వనికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యాకులు రాజు, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాషులు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక టిప్పర్లు పట్టివేత




- ఆంధ్రా నుండి బిల్లులు లేకుండా తరలిస్తున్న 2 టిప్పర్లు, 1 బైక్ సీజ్
- 4 గురు అరెస్ట్, రిమాండ్ కు తరలింపు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై నేలకొండపల్లి పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. నేలకొండపల్లి ఎస్ ఐ పి. శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఈరోజు ఉదయం తిరుమలా పురం గ్రామం నందు పెట్రోలింగ్ చేయుచుండగా చెరువు మాదారం క్రాస్ రోడ్డు వద్దకు రాగా, చెరువుమాదారం వైపు నుండి రెండు టిప్పర్లు రావడం గమనించారు.వాటిని ఆపి తనిఖీ చేయగా అవి ఆంధ్రప్రదేశ్ నుండి బిల్లులు లేకుండా అక్రమంగా, దొంగతనంగా ఇసుక లోడుతో తరలిస్తున్నట్లు గుర్తించారు.పట్టుబడిన వారు & వాహనాలు ఎస్ కె. షబ్బీర్ R/o గండేపల్లి గ్రామం, కంచికచర్ల మండలం, ఎన్టీఆర్ జిల్లాఅరిగెల భూలక్ష్మి నారాయణ R/o కొడవటి కల్లు గ్రామం, చందర్లపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా సాంబ శివరావు R/o జగ్గయ్యపేట టౌన్ చోప్పలపూడి శివరావు R/o కొడవటి గ్రామం, చందర్లపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లాపోలీసులు రెండు ఇసుక టిప్పర్లను, ఒక బైక్ ను స్వాధీనం చేసుకుని, నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు

## అధికారుల నిర్లక్ష్యం యావాపూర్‌కు అక్షయపాత్ర చేరని వైనం

**విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక ఆందోళన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు గ్రామస్తులు**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** అధికారుల నిర్లక్ష్యం కారణంగా నవాబుపేట్ మండల పరిధిలోని యావాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు అక్షయపాత్ర ద్వారా సరఫరా కావాల్సిన మధ్యాహ్న భోజనం అందక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతిరోజూ సమయానికి అందాల్సిన మధ్యాహ్న భోజనం రాకపోవడంతో చిన్నారులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని మండిపడ్డారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అక్షయపాత్ర వాహనం ప్రతిరోజూ సమయానికి వచ్చేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరారు.

**సకాలంలో విద్యార్థులకు భోజన అందించేందుకు చర్యలు ఎంఈఓ అబ్దుల్ రహమాన్**

నవాబుపేట్ మండల పరిధిలోని యావపూర్ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలలో అక్షయపాత్ర నుండి మధ్యాహ్నం భోజనం సమయానుకూలంగా రాకపోవడంతో అక్షయపాత్ర మేనేజర్ సంబంధిత అధికారులకు తెలియపరచడం జరిగిందన్నారు. అక్షయపాత్ర వారు ఆగస్టు 1వ తేదీ నుండి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన పాత్రల వలన సమస్య వచ్చినట్లు తెలపడం జరిగిందన్నారు. ఈ సమస్య పునరావృతం కాకుండా చూసుకుంటామని అక్షయపాత్ర వారు తెలపడం జరిగిందని తెలిపారు.

## పరిగి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన మల్టీ జోన్–II ఐజీపీ షహనవాజ్ ఖాసీం




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వార్షిక తనిఖీలలో భాగంగా మల్టీ జోన్–II ఐజీపీ షహనవాజ్ ఖాసీం సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా ఐజీపీకి బొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన ఐజీపీ పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనిఖీలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణ తీరు, ప్రజల పట్ల వ్యవహరించే విధానం, కార్యాచరణ సామర్థ్యాన్ని సమగ్రంగా పరిశీలించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఐజీపీ వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థ, నేరాల నియంత్రణలో వాటి వినియోగాన్ని పరిశీలించి పోలీసుల పనితీరును ప్రశంసించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, స్టేషన్ డైరీలు, వివిధ రిజిస్టర్లు, మాల్ఖానా నిర్వహణ, రిసెప్షన్,



లాక్‌అప్, కంప్యూటర్ విభాగం, మహిళా సహాయ కేంద్రం, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి కేసులో నాణ్యమైన సాక్ష్యాధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రికార్డుల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఐజీపి మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి తనలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి నిరంతరం అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలి. సరైన అలవాట్లు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, సేవా దృక్పథం ప్రతి పోలీస్‌కు అత్యంత అవసరం. ప్రజలకు న్యాయం చేయడం, వారి విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీస్ బాధ్యత" అని పేర్కొన్నారు. అదేవిధంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ఎన్ డి పి ఎస్ చట్టం క్రింద మాదకద్రవ్యాల నిర్మూలనకు మరింత కఠిన చర్యలు కొనసాగించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన వెంటనే స్పందిస్తూ గోల్డెన్ అవర్ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందేలా పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలని, ప్రతి ప్రాణం విలువైనదనే భావనతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మరింత స్నేహపూర్వకంగా మెలుగుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని, గ్రామ స్థాయిలో ప్రజలతో సమన్వయాన్ని పెంపొందించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థలు, సీసీటీవీ నెట్‌వర్క్‌ను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పరిగి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఐజీపీ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి విధి నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి,పరిగి ఎస్ఐ మోహన కృష్ణ , ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

